అప్రమత్తంగా ఉండాలి



వర్షపు నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీసీ రవికుమార్

మైలార్‌దేవ్‌పల్లి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన వర్షం నీటి తొలగింపు పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డీసీ మాట్లాడుతూ... యుద్ధప్రాతిపాదికన రోడ్లపై నిలిచిన వర్షపు నీటి తొలగింపు పనులను చేపట్టామన్నారు. నాలాలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను, వ్యర్థాలను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు.

ముష్కి 'చెరువు కట్ట'కు గండి



మణికొండ: నిబంధనలకు విరుద్ధంగా చెరువు పరిధిని తగ్గించి కొత్తగా ఏర్పాటు చేసిన చెరువు కట్ట తెగింది. వివరాలివీ... మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కి చెరువును అభివృద్ధి చేస్తున్నామని ధ్రువాన్ష్ అనే సంస్థ చెరువు పరిధిని తగ్గిస్తూ కొత్తగా కట్టను ఏర్పాటు చేసింది. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కట్ట తెగిపోయింది. చెరువును కుదించటం, అందులో మురికి నీటిని కలపటం, ఓ రియల్ ఎస్టేట్ సంస్థలకు మేలు చేసేందుకు ప్రయత్నించిన సదరు సంస్థపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినిసియావాసులు డిమాండ్ చేశారు. చెరువులోకి వచ్చే వరద నీటి ప్రవాహానికి అడ్డుగా కట్ట ఏర్పాటు చేయటం సదరు సంస్థ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు కొత్తగా ఏర్పాటు చేసిన కట్టను పూర్తిగా తొలగించి చెరువు పరిధిని పెంచటంతో పాటు అందులో మురికినీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'నిథమ్' అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ



రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి సూచించారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా నిథమ్ అధికారులు, ఫ్యాకల్టీ, ఉద్యోగులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చక్కటి, ఆహ్లాదపూరిత వాతావరణం కలిగిన నిథమ్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు భవిష్యత్తులో అనేక చర్యలు తీసుకుందామన్నారు. విద్యార్థులు, శిక్షణ కోసం వచ్చే వారికి చక్కటి వాతావరణంతోపాటు అధునాతన సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుందామన్నారు. నిథమ్ క్యాంపస్‌లో వనమహోత్సవం, ప్రపంచ పర్యాటక దినోత్సవం, ఇతర వేడుకలు, వనమహోత్సవ్ ఫ్యామిలీ డే, ఫ్యాకల్టీ రీట్రీట్, హ్యాకథాన్, మారథాన్, వాకథాన్, వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బోనాలకు వేళాయె!

- ముస్తాబైన దేవాలయాలు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగంగా ఆషాఢ మాసంలో గ్రామ దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు నిర్వహించే బోనాల జాతరకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాలు ముస్తాబయ్యాయి. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంతో పాటు పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, గండిపేట, కోకాపేట, గోలిదొడ్డి, జన్వాడ, మిర్జగూడ తదితర గ్రామాలలో ఆదివారం బోనాలను నిర్వహించుకోనున్నారు. అందులో భాగంగా ఆయా గ్రామ దేవాలయాలను రంగులు, వీధి దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బోనాల పాటలతో ఆయా గ్రామాలు హోరెత్తుతున్నాయి. గ్రామాలలోని ప్రధాన కూడలిలతో పాటు దేవాలయాలను వేప కొమ్మలతో అలంకరించారు. పలు గ్రామాలలో ఉదయం నుంచే భక్తులు అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. కొన్ని గ్రామాలలో మహిళలంతా ఒకే సారి సామూహికంగా తరలి వెళ్లి బోనాలను సమర్పిస్తారు. తొట్టెలు, పలహారం బండ్ల ఊరేగింపులు, పోతరాజులను సిద్ధం చేసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు దేవాలయాల వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ పారిశుద్ధ్య పనులతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బోనాలకు సిద్ధమైన మణికొండ పోచమ్మ ఆలయం



ఆలయాన్ని పూలతో అలంకరిస్తూ...



బోనాలకు సిద్ధమైన పుప్పాలగూడ పోచమ్మ దేవాలయం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మణికొండ మాజీ చైర్మన్ నరేందర్

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని ఓంనగర్ కాలనీ ఎస్ఎం ఎన్‌క్లేవ్ ఫేస్–1 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం కమిషనర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో రోడ్ల పరిశుభ్రత, డ్రైనేజీ క్లీనింగ్, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలపై విన్నవించారు. రోడ్లను రోజూ ఊడ్వకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోతోందన్నారు. డ్రైనేజీలు సైతం నిండి రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నదన్నారు. దీంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయన్నారు. వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ నేతలు వెంకట్, రాఘవ, సుబ్బు, కృష్ణారెడ్డి, శంకర్, రంజిత్, శ్రీధర్, వాసవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



యాదాద్రి కాలనీలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని జాగృతం చేస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శనివారం ఉదయం కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లోని యాదాద్రి కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, యాదాద్రి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పించన్లు పెంచకపోతే యుద్ధమే

ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి గణేష్‌మాదిగ

మణికొండ: ఎన్నికల సమయంలో పింఛన్‌లు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విషయాన్నే పట్టించుకోవడం లేదని, వెంటనే వారికి ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌లను పెంచకపోతే రాబోయే రోజుల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో యుద్ధం చేస్తామని గండిపేట మండల ఇంచార్జి పి.గణేష్ మాదిగ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రూ. 2 వేలు ఉన్న వితంతు పింఛన్లను రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు, గుడ్డి, కండరాలు పట్టేసుకున్న వారికి రూ. 15 వేల చొప్పున పింఛన్‌లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పింఛన్‌లను పెంచాలని ఈ నెల 21వ తేదీన ఆమనగల్‌లో జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని, దానికి పింఛన్‌దారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. 18 నెలలకు నెలకు వెయ్యి కోట్ల పెంపు పింఛన్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. జిల్లా స్థాయి సదస్సులకు రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే ఆగస్టు 13వ తేదీన హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున రాష్ట్ర స్థాయి బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వ పనితీరును ఎండగడతామన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్



బ్యాగులను పంపిణీ చేస్తున్న ఆవోపా నాయకులు

మణికొండ: పేదలు, విద్యార్థులు, అవసరమైన వారిని గుర్తించి వారికి సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆర్యవైశ్య అఫిషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్(ఆవోపా) రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, రాష్ట్ర కార్యదర్శి కాచం నాగరాజు అన్నారు. శనివారం మణికొండ ఎంప్లాయీస్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుప్పాలగూడ యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో లేని వారికి ఉన్న వారు పెట్టడం మానవ సహజం అన్నారు. సేవా కార్యక్రమాలు మనకు ఎంతో తృప్తిని ఇస్తాయని, రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. మొబైల్ ఫోన్‌లు వాడవద్దని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని జీవితంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి. శ్రీధర్, మహిళా అధ్యక్షురాలు జి.స్రవంతి, స్థానిక సభ్యులు భానుచందర్, యుగేందర్, బాలస్వామి, రాములు, మల్లయ్య, రాము, నరేంద్ర, మల్లేశం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ (రాజేంద్రనగర్) కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌లుగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, చరిత్ర, పొలిటికల్ సైన్స్, బాటనీ, జువాలజీ, గణితం, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టుకు, కామర్స్‌లో రెండు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలి తెలిపారు. సెట్ నెట్, పీహెచ్‌డీ లాంటి అదనపు అర్హతలు, బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం సంబంధిత ధ్రువ పత్రాలతో కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళా సంఘాలకు రుణాల పంపిణీ



రుణాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు మంజూరైన బ్యాంకు రుణాలను రాజేంద్రగనర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ శనివారం పంపిణీ చేశారు. పెద్దషాపూర్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా సంఘాలకు రూ. 21 కోట్ల 24 లక్షల అరవై వేల బ్యాంకు రుణాలు, రూ. 90 లక్షల వడ్డీ లేని రుణాలను అందజేశారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీల చైర్మన్లు శ్రవణ్‌కుమార్‌గౌడ్, దొనాకర్‌గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలను సహించం

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి



మున్సిపల్ సిబ్బంది కూల్చిన ప్రహరీ

మణికొండ: రోడ్లు ఇరుకుగా మారి పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తున్నాయని, వాటిపై వచ్చే ఆక్రమణలను ఎట్టి పరిస్థితిలోనూ సహించే ప్రసక్తే లేదని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో పోచమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో రోడ్లపైకి వచ్చి నిర్మించుకున్న ప్రహరీలు, ర్యాంప్‌లను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో రోజు, రోజుకు పెరుగుతున్న జనాభా, వాహనాలతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు రోడ్లపైకి వచ్చే నిర్మాణాలను, ఆక్రమణలను పలు మార్లు తొలగించామన్నారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసుకునే వ్యాపారాలను రాబోయే రోజుల్లో తొలగిస్తామన్నారు. ఆక్రమణలను తొలగించిన చోట తిరిగి నిర్మిస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లను సాధ్యమైనంత వెడల్పుగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. టీపీఓ మణిహారిక, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ఆడపిల్ల పుట్టిందని అమ్మేశారు..!

- అంగన్‌వాడీ కార్యకర్త చొరవతో వెలుగు చూసిన ఘటన
- ఆర్థిక స్తోమత లేక చిన్నారిని పోషించలేమన్న దంపతులు
- చిన్నారిని శిశువిహార్‌కు అప్పగింత



శిశువిహార్‌కు పాపను అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

శంషాబాద్ రూరల్: అప్పటికే ఆ ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.. ఇటీవల మరో ఆడబిడ్డ పుట్టింది.. ఇంత మందిని పెంచే స్తోమత లేని తల్లిదండ్రులు ఆ చిన్నారిని ఆస్పత్రిలోనే ఎవరికో అప్పగించారు. ఇంటికి చేరుకున్న దంపతులు.. పాప చనిపోయిందని అందరినీ నమ్మించారు. వీరి ప్రవర్తనపై అనుమానం కల్గిన అంగన్‌వాడీ కార్యకర్త ఆరా తీయగా.. అసలు విషయం వెలుగు చూసింది. ఐసీడీఎస్ అధికారుల చొరవతో ఆ చిన్నారిని శనివారం శిశువిహార్‌కు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి కొత్తతండాకు చెందిన పాత్లావత్ రవి ఆటో ట్రాలీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని మొదటి భార్యకు ఓ కూతురు, కొడుకు ఉండగా.. కుటుంబ కలహాలతో కొన్నేళ్ల కిందట ఆమె కొడుకును తీసుకుని వెళ్లిపోయింది. దీంతో కూతురు ఇతని వద్దనే ఉంటుంది. తర్వాత ఇతను దుర్గ అనే మహిళను పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఈ దంపతులకు ఓ కూతురు పుట్టింది. తర్వాత గర్భం దాల్చిన దుర్గ ఈ నెల 9న శంషాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. చిన్నారితో కలిసి రెండు రోజుల పాటు అక్కడే ఉన్న దుర్గ.. మరుసటి రోజు దంపతులు ఖాళీ చేతులతో ఇంటికి వచ్చారు.

అంగన్‌వాడీ కార్యకర్త సందర్శనతో వెలుగులోకి..

బాలింత, శిశువు ఆరోగ్య పరిస్థితి, వివరాలు తెలుసుకునేందుకు ఈ నెల 15న స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ వారి ఇంటికి వెళ్లింది. శిశువు ఎక్కడ ఉందని అడిగితే.. పాప ఉమ్మనీరు తాగి ఆస్పత్రిలో అనారోగ్యంతో చనిపోయిందని చెప్పారు. అయితే చిన్నారి చనిపోయినట్లు ఆస్పత్రి నుంచి ధ్రువీకరణ పత్రం ఎక్కడ అంటూ ఆరా తీసింది. దీంతో పొంతనలేని సమాధానం చెప్పడంతో.. వారిపై అనుమానం కల్గింది. పాపను ఎవరికి ఇచ్చారో చెప్పకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో మరుసటి రోజు ఆ పాపను ఇంటికి తీసుకొచ్చారు.

దత్తత ఇచ్చారా.. అమ్మేశారా..

తమ ఆర్థిక పరిస్థితి బాగాలేక.. పుట్టిన ఆడ పిల్లను పోషించలేమని ఆస్పత్రి వద్ద ఎవరికో దత్తత ఇచ్చినట్లు చిన్నారి తల్లిదండ్రులు పేర్కొన్నారు. దత్తత తీసుకున్న వారి వివరాలు తెలుపలేదు. అయితే ఈ ఘటనలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రి వద్ద పాపను అమ్మేసినట్లు భావిస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడటం.. దత్తత తీసుకున్నట్లు చెబుతున్న వారి వివరాలు బయటకు రాకుండా జాగ్రత వహిస్తున్నట్లు తెలుస్తుంది.

శిశువిహార్‌కు చేరిన చిన్నారి..

చిన్నారిని పోషించే స్థోమత లేదని తల్లిదండ్రులు చెప్పడంతో శనివారం ఆ పాపను శిశువిహార్‌కు అప్పగించారు. బాలల రక్షణ అధికారి ప్రవీణ్ ఆ దంపతులకు కౌన్సిలింగ్ ఇవ్వగా.. తాము చిన్నారిని పోషించలేమని చెప్పారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ, సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి సమక్షంలో చిన్నారిని అప్పగించారు. అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ చొరవను డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మోతీ అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ రాజేంద్ర ప్రసాద్ తివారి తండ్రి కీ.శే. సత్యనారాయణ ప్రసాద్ తివారి, వయస్సు 61 సం॥లు, మరియు సంతోష్ కుమార్ తండ్రి కీ.శే. సత్యనారాయణ ప్రసాద్, నా క్లయింట్ సొంత ఆస్తి అయిన గండిపేట మండలం, రంగారెడ్డి జిల్లా వద్ద సర్వే నెం.50, 51 ఎకరములు 4-35 గుంటలు, విస్తీర్ణం గల భూమి మొత్తము ఎకరములు 4-35 గుంటలకు సంబంధించి పార్టీషన్ దావా గౌరవ XI Addl. District Judge, Ranga Reddy District, OS No. 349/2024 దావా వేసినారు. హీరాలాల్ మరియు కుటుంబీకులు కలసి M/s. Gangothri Developers కె. మధురం రెడ్డికి Development Agreement చేశారు. మరియు ఇతరుల మీద దావా దాఖలు చేశారని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు ఇది Hon'ble XI Additional District Judge, R.R.Dist., L.B.Nagar, న్యాయస్థానం రంగారెడ్డి జిల్లా పార్టీషన్ దావా మరియు దావాకు మెంట్లు చెల్లనివిగా ప్రకటించుట కొరకు దావా పెండింగ్‌లో ఉన్నది. అది సదరు న్యాయస్థానం సమక్షంలో పెండింగులో ఉన్నది. హీరాలాల్ మరియు ఇతరులు కె.మధురం రెడ్డి మరియు ఇతరులతో పై సదరు ఆస్తికి సంబంధించిన ఎవరైన ఎలాంటి లావాదేవిలు మరియు ఇతరత్రా వ్యవహారాలు జరిపితే వారు వారి సొంత పూచికత్తుపై చేసినట్లు అవుతుంది మరియు తదుపరిగా వారు వాటి నుండి ఏర్పడే అన్ని పర్యవసానాలకు బాధ్యులు అవుతారు.

సం/- కె. వినోద్ కుమార్ గౌడ్, అడ్వకేట్
గ్రౌండ్ ఫ్లోర్, అమ్మప్ప నిలయం, ఫ్లాట్ నం.2,
శ్రీనగర్, రోడ్ నం. 10/1, సాగర్ క్రాస్ రోడ్స్ దగ్గర,
ఎల్బీనగర్, హైదరాబాద్. టి.ఎ. - 500 074.
ఫోన్: 7702576308, 8639146574.

చెరువులకు జలకళ



సుల్తాన్‌పల్లిలో బోడవోని కుంటలోకి చేరిన నీరు



కేబీ దొడ్డి వద్ద ప్రవహిస్తున్న ఈసీ వాగు

శంషాబాద్ రూరల్: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీంతో మండల పరిధిలోని ఎంటేరు, ఈసీవాగుల్లో భారీగా వరదపారింది. సుల్తాన్‌పల్లిలోని బోడవోని కుంట నిండు కుండలా మారింది. ననాజీపూర్, మల్కారం, రామంజాపూర్, కాచారం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. ఇక సుల్తాన్‌పల్లిలోని హనుమాన్ దేవాలయం ప్రహరీ వర్షానికి కూలింది. అమ్మవారి ఆలయం ప్రహరీ సైతం కూలిపోయింది. ఇదిలా ఉండగా.. పట్టణంలో 38 మిల్లీ మీటర్లు, పెద్దషాపూర్‌లో 41.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ శ్రీవేణి తెలిపారు.



సుల్తాన్‌పల్లిలో కూలిన హనుమాన్ దేవాలయ ప్రహరీ